## క్లుప్తంగా

### పోలీస్ శాఖకు డ్రోన్ కెమెరా అందజేత



నగరంపాలెం: జిల్లా పోలీస్ విభాగానికి ఉప్పుటూరి చిన్నరాములు సేవా ట్రస్ట్ తరఫున వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట గ్రామ వాసి ఉప్పుటూరి చిన్నరాములు డ్రోన్ కెమెరాను ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌కు అందించారు. చిన్నరాములును ఆయన సత్కరించారు. సామాజిక బాధ్యత, సేవా దృక్పథంతో కెమెరాను అందించడం అభినందనీయమని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. అనంతరం డ్రోన్ కెమెరాను వట్టిచెరుకూరు పీఎస్ సీఐ రామానాయక్‌కు ఎస్పీ అప్పగించారు.

### వైభవంగా శ్రీలక్ష్మీనారాయణుల కల్యాణం



నగరంపాలెం: అరండల్‌పేట 4/2వ అడ్డరోడ్డులోని శ్రీఅష్టలక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో నిర్వహిస్తోన్న 30వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఆదివారం గోపూజ, గణపతి పూజతో ప్రారంభించారు. శ్రీలక్ష్మీనారాయణుల కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం హంపీ పీఠాధీశ్వరులు శ్రీ విద్యారణ్యభారతిస్వామి ఆధ్వర్యంలో కల్యాణ మూర్తులకు పలు పుష్పాలు, సుగంధ ద్రవ్యాలు, ప్రత్యేకంగా తులసితో అభిషేకార్చన చేశారు. పుణ్యాహవచనం, మండపారాధన, ప్రవరలు, మహాసంకల్పంతో మంత్రార్థాలను వివరించారు. అనంతరం శాంతి హోమం, మహా పూర్ణాహుతి చేపట్టారు. భక్తులకు సంప్రోక్షణ చేసి తీర్థ, అన్నప్రసాద వితరణ చేశారు. ప్రధాన అర్చకులు మర్రిపాటి ప్రసాద్‌శర్మ, ధర్మకర్త మర్రిపాటి పార్థసారథి పాల్గొన్నారు.

### బిల్డింగ్ పైనుంచి పడి వ్యక్తి మృతి

పట్నంబజార్: ప్రమాదవశాత్తు బిల్డింగ్ పైనుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు అయింది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా వేమూరుకు చెందిన ఎం.దుర్గాప్రసాద్ (56) గుంటూరులోని నాజ్ సెంటర్‌లో ఉన్న ఒక లాడ్జిలో ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఒక వస్తువు తీసుకునేందుకు రెండో అంతస్తులోని పిట్టగోడ ఎక్కుతూ ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. లాడ్జి నిర్వాహకులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### పేదలకు అన్నదానం



గుంటూరు రూరల్: వర్సటైల్ సర్వీసెస్ ట్రస్ట్, శ్రీకృష్ణ అకాడమీ ఆధ్వర్యంలో నాయుడుపేటలోని డంపింగ్ యార్డులో నివసిస్తున్న పేదలకు ఆదివారం అన్నదానం చేశారు.పేదలకు సాయం చేయడం సంతోషాన్నిస్తుందని ట్రస్ట్ చైర్మన్ పాశం శ్రీకృష్ణదేవరాయ యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు పాశం సర్దార్ అభినంద్‌యాదవ్, కోనంకి మురళీకృష్ణ యాదవ్, ఆలా రాఘవయ్య, శకుంతల, కోటేశ్వరరావు, అనురాధ, ట్రస్ట్ వాలంటీర్స్ ఆనంగి కృష్ణతేజ, సత్య, హర్ష, సంతోష్ పాల్గొన్నారు.

### ఎస్టీలకు నిలువ నీడ కల్పించాలి



గార్లపాడు(కాకుమాను):నల్లమడ వాగు కట్టపై పూరి గుడిసెలలో నివసిస్తున్న ఎస్టీ కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు మంజూరు చేసి పక్కా గృహాలు నిర్మించాలని సీపీఎం నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు డిమాండ్ చేశారు.మండలంలోని గార్లపాడు, కొమ్మూరు గ్రామాల్లో ఆదివారం పార్టీ పిలుపు మేరకు ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు.ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుంచి గార్లపాడు సమీపంలోని నల్లమడ వాగు కట్టపై ఇరవై ఎస్టీ కులానికి చెందిన కుటుంబాలు పూరి గుడిసెలు ఏర్పాటు చేసుకుని నివసిస్తున్నాయని ఆయన తెలిపారు.ప్రభుత్వాలు, పాలకులు మారినా ఈ కుటుంబాల్లో కష్టాలు మాత్రం తీరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు మంజూరు చేసి పక్కా గృహాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కొత్త వెంకట శివరావు, రామారావు, శ్రీనివాసరావు, రాజేంద్ర పాల్గొన్నారు.

# నగరానికి ఐకానిక్‌గా మార్కెట్ నిర్మాణం

- కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్
- ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచన



వ్యాపారులతో సమావేశమైన కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే గళ్లా మాధవి, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు నగరానికి ఐకానిక్‌గా, వ్యాపారాలకు సమస్యలు లేకుండా పీవీకే నాయుడు మార్కెట్‌ని అధునాతనంగా నిర్మించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, అధికారులతో కలిసి మార్కెట్‌ని పరిశీలించారు.అనంతరం జీఎంసీ కౌన్సిల్ సమావేశ మందిరంలో మార్కెట్ వ్యాపారులు, సంఘాల ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎంసీపై ఆర్థిక భారం లేకుండా, ప్రస్తుతం అక్కడున్న వ్యాపారులకు ఇబ్బంది లేకుండా మార్కెట్ నిర్మాణం ఉంటుందని తెలిపారు. వ్యాపారులు కూడా అపోహలు పెట్టుకోవద్దని, ప్రజా ప్రతినిధులు, జీఎంసీ అధికారులు అందుబాటులోనే ఉంటారని ఆయన తెలిపారు. ఏ సమస్య ఉన్నా పరిష్కరించుకుందామని చెప్పారు. మార్కెట్ నిర్మాణాన్ని పీపీపీ(పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్ షిప్) విధానంలో చేయడం ద్వారా జీఎంసీపై ఆర్థికభారం కూడా పడదని పేర్కొన్నారు. మార్కెట్ నిర్మాణం అనంతరం తగిన ఆదాయం వచ్చేందుకు ఫ్లోర్‌లు అద్దె ప్రాతిపదికన ఇచ్చేలా ముందస్తుగానే ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంక్‌లు, వ్యాపార సంస్థలతో అగ్రిమెంట్ తీసుకుంటే మంచిదని సూచించారు. సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో మార్కెట్, పక్కనే ఉన్న జీఎంసీ కార్యాలయం స్థానంలో నూతన భవనం నిర్మాణానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సంయుక్తంగా చర్చించి, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. తొలుత పీవీకే నాయుడు మార్కెట్‌ని ఎంపీ పరిశీలించారు. వ్యాపారులతో మాట్లాడి, వారి అభిప్రాయలు, అనుమానాలు తెలుసుకొన్నారు. కౌన్సిల్ సమావేశ మందిరంలో నగర కమిషనర్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ప్రస్తుతం మార్కెట్‌లో వ్యాపారస్తుల వివరాలు, ఇప్పటి వరకు రూపొందించిన డిజైన్‌ని వివరించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ షేక్ సజీల, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, ఎస్‌ఈ నాగమల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, డెప్యూటీ కమిషనర్లు సీహెచ్. శ్రీనివాస్, టి.వెంకటకృష్ణయ్య, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, పీవీకే నాయుడు మార్కెట్ వ్యాపారులు పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాముల జీవితం ఆదర్శప్రాయం



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే మాధవి

నెహ్రూనగర్: ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణ త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు జీవితం నేటి తరానికి ఆదర్శమని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా హిందూ కాలేజీ జంక్షన్‌లోని విగ్రహానికి నగర కమిషనర్ శ్రీనివాసులు, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ప్రజా ప్రతినిధులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ పోరాట పటిమ, తెలుగువారి ఆత్మగౌరవానికి పొట్టి శ్రీరాములు చిహ్నంగా ఉంటారని తెలిపారు. ఉక్కు సంకల్పంతో ప్రజల కోసం నిస్వార్థంగా పోరాడితే సాధించలేనిది ఏమి లేదని పొట్టి శ్రీరాములు జీవితం తెలియజేస్తుందని చెప్పారు. కార్యకమంలో డెప్యూటీ మేయర్ షేక్ సజీల, అధికారులు పాల్గొన్నారు.

## నేడు నగరపాలక సంస్థ ముందు సీపీఐ ధర్నా



మావేశంలో మాట్లాడుతున్న మాల్యాద్రి

లక్ష్మీపురం: పేద ప్రజలకు రెండు సెంట్ల ఇళ్ల స్థలాన్ని కేటాయించి ఇంటి నిర్మాణం కోసం ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి తెలిపారు. స్థానిక కొత్తపేటలోని జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం పది గంటలకు జరగనున్న ధర్నాలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పాల్గొంటారని తెలిపారు. పేదలంతా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతూ మూడు నెలలుగా సీపీఐ ఆధ్వర్యంలో నగరంలోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద ప్రజలకు నివేశన స్థలాలు,ఇంటి నిర్మాణం కోసం ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతూ అర్జీలు తీసుకున్నట్లు చెప్పారు. వీటిని మున్సిపల్ కమిషనర్‌కి అందించనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో సీనియర్ నాయకులు నూతలపాటి చిన్న, కార్యవర్గ సభ్యులు రావుల అంజిబాబు, చల్లా మరియదాసు పాల్గొన్నారు.


## అవోపా ఆధ్వర్యంలో పేదలకు పింఛన్ల పంపిణీ



పెన్షన్లు పంపిణీ చేస్తున్న సభ్యులు

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని ఆర్య వైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో ఆదివారం 108 మంది పేదలకు రూ.500 చొప్పున నెలవారీ పెన్షన్లు పంపిణీ చేశారు. ముందుగా అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సాయి ప్రగతి ఇన్‌ఫ్రా డైరెక్టర్ తెడ్ల గురుప్రసాదరావు మాట్లాడుతూ పేదలు, వృద్ధులకు ప్రతి నెలా రూ.500 చొప్పున పెన్షన్ ఇవ్వడం అభినందనీయమన్నారు. అవోపా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు సహాయ, సహకారాలు అందిస్తానని తెలిపారు. కరూర్ వైశ్యా బ్యాంక్ మేనేజర్ సీహెచ్. అరవింద్ గణేష్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు దాన గుణానికి మారుపేరు అన్నారు. అవోపా ద్వారా విద్య, వైద్యం అందించడం అభినందనీయమని తెలిపారు. అవోపా రాష్ట్ర కార్యదర్శి రాచపూడి సుబ్బారావు మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం ఫలితంగా ఆంధ్రప్రదేశ్ తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో అవోపా గుంటూరు అధ్యక్షుడు కేవీ బ్రహ్మం, ఊటుకూరి నాగేశ్వరరావు, కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, మద్ది సాయి రమేష్, అమరా రమేష్, మిరియాల మోహన్‌రావు పాల్గొన్నారు.

## షుగర్, బీపీలే కిడ్నీ సమస్యలకు మూలం



మాట్లాడుతున్న డాక్టర్ పెంట్యాల శ్రీకాంత్

లక్ష్మీపురం: షుగర్, బీపీలే కిడ్నీ సమస్యలకు మూలమని ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ పెంట్యాల శ్రీకాంత్ తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య సభ నిర్వహించారు. డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ మధుమేహం, రక్తపోటును అదుపులో ఉంచుకోవాలని, లేనిపక్షంలో మూత్రపిండాలు దెబ్బతింటాయని తెలిపారు. రక్తంలో క్రియాటిన్ స్థాయి పెరిగి చివరకు డయాలసిస్ చేయాల్సిన పరిస్థితి వస్తుందని చెప్పారు. క్రియాటిన్ 1.2 నుంచి 1.6 మధ్యలో ఉంటే సాధారణ స్థాయి అని తెలిపారు. ప్రోస్టేట్ గ్రంథి గురించి వివరించారు. మగవారిలో వయసు పెరిగే కొద్దీ కొంత మార్పు చెందుతుందని తెలిపారు. దీనివల్ల మూత్ర విసర్జనలో చురుకు, మంట, సన్నగా రావడం, తరచూ వెళ్లడం, మూత్ర విసర్జన పూర్తిగా చేయలేకపోవడం లక్షణాలు కనబడతాయని వివరించారు. ఇవి కనిపించిన వెంటనే యూరాలజిస్టును సంప్రదించాలని సూచించారు. ఆరోగ్య సభకు టి.వి. సాయిరాం కో–ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. సంస్థ సభ్యులు కె.చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన సంగీత సన్మండలి వార్షిక వేడుకలు



సింధు రాగేశ్వరికి సత్కారం

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళా వేదికపై గాయత్రీ మహిళా సంగీత సన్మండలి 28వ వార్షిక వేడుకలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సంగీత సన్మండలి అధ్యక్షురాలు, వైద్యురాలు పి.విజయ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సంస్థ సంచికను డాక్టర్ కె.వీరన్ (విజయవాడ), అతిథులు ఆవిష్కరించారు. మల్లాది సింధు రాగేశ్వరి (విజయవాడ)కి బంగారు పతకం ప్రదానం చేసి సత్కరించారు. అనంతరం ఆమె శాస్త్రీయ గాత్ర కచేరీలో వాగ్గేయకార కృతులను గానం చేశారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి ఎం.వై. శేషురాణి, ఉపాధ్యక్షులు డాక్టర్ ఎం.రాజరాజేశ్వరి, మాధవపెద్ది మీనాక్షి, పాటిబండ్ల లలితాదేవి, కార్యదర్శి ఎ.వి. మంగాదేవి, కోశాధికారి విజయలక్ష్మి పాల్గొన్నారు.

### వైభవంగా సహస్ర దీపాలంకరణ సేవ



నగరంపాలెం: స్థానిక ఆర్.అగ్రహారం శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో 29వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సహస్ర దీపాలంకరణ సేవను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. సుప్రభాత సేవ, స్వామికి విశేష పూజలు, నిత్యార్చన, నిత్య హోమాలు, విశేష హోమాలు, బలిహరణ కార్యక్రమాలను వేద పండితులు జరిపారు. కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ, కార్యదర్శులు పాతకోట బ్రాహ్మణయ్య నాయుడు, దాసరి భాస్కరరావు పర్యవేక్షించారు.

### భక్తిప్రపత్తులతో తిరుపతమ్మకు పూజలు



నగరంపాలెం: కొరిటెపాడు (ఆంజనేయపేట) వాకింగ్ ట్రాక్ ఎదురుగా ఉన్న శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్యస్వామి ఆలయ మహోత్సవాలు ఆదివారం కొనసాగాయి. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, గోపూజ, శ్రీలక్ష్మీనారాయణ హోమం, అశ్వత్థ నారాయణ పూజను వేద పండితులు భక్తిప్రపత్తులతో నిర్వహించారు. సాయంత్రం ఆలయ నిర్వాహకులు ముత్తయిదువులకు పసుపుకుంకుమ, గాజులు పంపిణీ చేశారు. శ్రీనగర్‌కు చెందిన అను డ్యాన్స్ అకాడమీ విద్యార్థుల భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమాలను ఆలయ నిర్వాహకులు కన్నసాని విజయకుమార్ (రాజా) రవికుమార్, బాజీ పర్యవేక్షించారు.

### కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు బెంగళూరులో కంప్యూటర్, ట్యాలీ నైపుణ్యంపై ఉచిత శిక్షణతో పాటు నూరు శాతం ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి హరిప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ పాస్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన 18 నుంచి 28 ఏళ్ల లోపు వయసున్న అభ్యర్థులకు బెంగళూరులో 35 రోజుల పాటు ఉచిత భోజన, వసతితో కూడిన శిక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. ట్యాలీ ప్లస్ జీఎస్టీ, స్పోకెన్ ఇంగ్లిషు, కంప్యూటర్, కమ్యూనికేషన్, లైఫ్, ఇంటర్వ్యూ స్కిల్స్‌తో పాటు వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై అత్యుత్తమ శిక్షణ కల్పిస్తామని తెలిపారు. శిక్షణానంతరం వివిధ సంస్థల్లో నెలకు రూ.15వేలకు పైబడిన వేతనంతో నూరు శాతం ఉద్యోగాలను చూపిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 90004 87423 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

### సివిల్స్ శిక్షణకు మెరిట్ పరీక్ష

గుంటూరు ఎడ్యుకేషన్: యూపీఎస్సీ సివిల్స్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు మెరిట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పొన్నూరు రోడ్డులోని టార్గెట్ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ, యువకులకు ఈనెల 21,22,23వ తేదీల్లో ఉదయం 10 గంటలకు పరీక్షతో పాటు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులకు సివిల్స్ ఫౌండేషన్ శిక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు విద్యార్హతల వివరాలతో హాజరు కావాలని కోరారు. వివరాలకు 90305 62728 నంబర్లో సంప్రదించాలని సూచించారు.


### పట్టాభిపురం సీఐగా మధుసూదనరావు

నగరంపాలెం: పశ్చిమ సబ్ డివిజన్‌లోని పట్టాభిపురం పోలీస్ స్టేషన్ సీఐగా వీఆర్‌లో ఉన్న మధుసూదనరావు నియమితులయ్యారు. ఈ మేరకు గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. మధుసూదనరావు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత సీఐ వీరేంద్రబాబుని సీసీఎస్‌కు పంపించారు.

### నేడు డయల్ యువర్ కమిషనర్

నెహ్రూనగర్: నగర ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి సోమవారం ఉదయం 9.30గంటల నుంచి 10.30గంటల వరకు నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 0863-2224202 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్)ను కౌన్సిల్ హాలులో మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

### మనల్ని ఎవడ్రా ఆపేది....!



రోడ్డు ఆక్రమించి షాపు నిర్మాణం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అక్రమ కట్టడాలు పెరిగిపోతున్నాయి. రోడ్లు, డ్రెయిన్లు ఆక్రమించుకొని మరీ నిర్మాణాలు చేపడుతున్నారు. కొత్తపేట క్లాత్ మార్కెట్ వద్ద స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్ అండదండలతో రోడ్డు ఆక్రమించుకొని రాత్రికి రాత్రే దుకాణం నిర్మించారు. శ్లాబు వేసేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా పట్టణ ప్రణాళిక అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

–నెహ్రూనగర్

## లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా ఆందోళన

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి పిలుపు



సమావేశంలో రమాదేవి

లక్ష్మీపురం: లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరగనున్న ఆందోళనల్లో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పాత గుంటూరులోని కార్యాలయంలో కౌన్సిల్ సమావేశాన్ని జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ఎనిమిది గంటల పని విధానం, కార్మికులు అనేక త్యాగాలతో సాధించుకున్న హక్కులను సైతం హరించే విధంగా ఎన్డీఏ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చిందని తెలిపారు. రైతాంగం, కార్మికుల పోరాటాల వల్ల తాత్కాలికంగా అమలు ఆగిన, ఏప్రిల్ నుంచి లేబర్ కోడ్స్ అమల్లోకి తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ముమ్మర ప్రయత్నం చేస్తోందని చెప్పారు. దీన్ని ఐక్యంగా కార్మిక ఉద్యమం అడ్డుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. అఖిల భారత కార్మిక సంఘాలు ఏప్రిల్ మే నెలలో లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా దశల వారి పోరాటం , జాతీయ సార్వత్రిక సమ్మెను జరిపేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారని ఆమె వెల్లడించారు. ఇది జిల్లాలో విస్తృతంగా కార్మిక వర్గంలోకి వెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె చెప్పారు. లేబర్ కోడ్స్ అమలయితే కార్మికులు హక్కుల్ని కోల్పోతారని తెలిపారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. నేతాజీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పీ ఫోర్ పేరుతో ప్రైవేటీకరణ విధానాలను ప్రజలపై తీవ్రతరం చేసేందుకు ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. విశాఖ ఉక్కుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వైఖరిని బట్టబయలు చేయాలని కోరారు. ప్రభుత్వ రంగ పరిరక్షణ కోసం ఐక్య పోరాటాలు నిర్వహణకు సిద్ధంకావాలని ఆయన పిలుపునిచ్చారు.

## విద్యార్థుల అభివృద్ధికి గురువులే కేంద్ర బిందువులు

సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టర్ లావణ్యాదేవి



ప్రతిభావంతులైన విద్యార్థులతో లావణ్యాదేవి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల అభివృద్ధికి కేంద్ర బిందువులు గురువులేనని సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టర్ బి.లావణ్యాదేవి పేర్కొన్నారు. కెనడీ విద్యాసంస్థల 44వ వార్షికోత్సవాన్ని ఆదివారం మార్కెట్ సెంటర్లోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లావణ్యాదేవి మాట్లాడుతూ విద్యార్థి దశలో సత్ప్రవర్తన, క్రమశిక్షణ కలిగిన వారు భావి జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకుంటారని తెలి పారు. ఈ సందర్భంగా గతేడాది టెన్త్ ఫలితా ల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగ దు బహుమతి, ప్రశంసాపత్రాలు అందజేశారు. చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు డాక్టర్ మాకినేని హేమంత్, కెనడీ విద్యాసంస్థల వ్యవస్థాపకురాలు సావిత్రి, డైరెక్టర్లు కె. శ్రీకాంత్‌బాబు, డాక్టర్ కె.శ్రీవిద్య బహుమతులు, ప్రశంసాపత్రాలు బహూకరించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో నెక్స్ జెన్ కిడ్స్, గ్లోబల్ కిండర్ గార్టెన్, నెక్స్‌జెన్ మెరిట్ క్యాంపస్‌ల ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పేదలకు బియ్యం, పింఛన్ల పంపిణీ



బియ్యం పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

నగరంపాలెం: సమాజంలో దివ్యాంగులు, వృద్ధులను ఆదుకునేందుకు సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని ఆర్యవైశ్య అఫీషియల్ అండ్ ప్రొఫిషనల్ అసోసియేషన్ (అవోపా) రాష్ట్ర అధ్యక్షులు తడవర్తి రాంబాబు కొనియాడారు. అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆదివారం ఆర్. అగ్రహారం శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం ఎదురున్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వాసవీ క్లబ్ గుంటూరు, మహిళా, యువ క్లబ్స్ సంయుక్తంగా 108 మందికి ఉచితంగా బియ్యం , పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఇటువంటి సేవా కార్యక్రమాలతో పేదలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. రానున్న రోజుల్లో మరెన్నో కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దాత ఆతుకూరి నరసింహారావు, వాసవీ క్లబ్స్ జోన్ చైర్‌పర్సన్ మున్నలూరి రాధ, అధ్యక్షులు రాయవరపు అశోక్‌కుమార్, బియ్యం పంపిణీ చైర్మన్, కో- చైర్మన్స్ కూనల భాస్కర్, గుండా హరి, శ్రీనివాస్ గుప్త, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.